సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 2 । సెప్టెంబర్ । 2022

సారా నిర్మూలనకు 14500 టోల్‌ఫ్రీ



నాటుసారాను నిర్మూలించేందుకు ఆపరేషన్ పరివర్తన -2లో భాగంగా 14500 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్టు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జె.రవికుమార్ అన్నారు. 8లో

పరుగు పందెంలో గిరి విద్యార్థి ప్రతిభ



అనంతగిరి బొడ్డచెట్టు కాలనీకి చెందిన బడిమెల యశ్వంత్‌తేజ్ అండర్–12 పరుగుపందెంలో ప్రతిభ కనబరిచి బంగారుపతకం సాధించాడు. 8లో

కళాశాల సమస్యలు పరిష్కరిస్తా



అరకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

టూరిజం ప్రాజెక్ట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్

అరకులోయ రూరల్: రూ.100 కోట్లతో టూరిజం ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నట్టు పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ తెలిపారు. గురువారం ఆయన ఈ ప్రాజెక్టుకు సంబంధించి మండలంలోని కొత్తభల్లుగుడ, పానిరంగిని గ్రామాల్లో స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఎకరాల్లో రూ.100 కోట్లతో టూరిజం ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోందన్నారు. దీనివల్ల వెయ్యి మంది స్థానిక గిరి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ వ్యవహారాల స్టడీ టూర్‌లో ఎంపీ మాధవి



కమిటీ సమావేశంలో ఎంపీ మాధవి

కొయ్యూరు: విదేశీ వ్యవహారాల స్టడీ టూర్‌లో అరకు ఎంపీ మాధవి పాల్గొన్నారు. దీనిలో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాన్ని కమిటీ సభ్యులు సందర్శించారు. పాస్‌పోర్టుల జారీ ప్రక్రియను పరిశీలించారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు



సీలేరు ప్రాంతంలో అతికించిన గోడపత్రికలు

సీలేరు : మావోయిస్టులకు వ్యతిరేకంగా అల్లూరి ఆదివాసీ యువజన సంఘం పేరిట గోడపత్రికలు వెలిసాయి. సీలేరు, దుప్పులవాడ, దారకొండ ప్రాంతాల్లో ఈ గోడపత్రికలు అతికించారు. వీటిలో మావోయిస్టుల ఎదురుకాల్పుల్లో మృతి చెందిన గిరిజనుల ఫొటోలు, అలాగే పోలీసులు గిరిజన యువతకు ఉద్యోగాలు కల్పించిన ఫొటోలను ముద్రించారు. మావోయిస్టుల బూటకపు మాటలు విని పార్టీలో చేరి ఎంతో మంది గిరిజన యువకులు చనిపోయారని, జీవితాన్ని నాశనం చేసుకోవద్దని గోడపత్రికల్లో ముద్రించారు.

డీపీఆర్వోగా రాములు



సాక్షి,పాడేరు : సమాచార, పౌరసంబంధాల శాఖలో సహాయ పౌరసంబంధాల అధికారిగా పనిచేస్తున్న పండు రాములుకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. పాడేరు డివిజనల్ పౌరసంబంధాల అధికారిగా పదోన్నతి కల్పిస్తూ సమాచార శాఖ కమిషనర్ గతనెల 29న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వణికిస్తున్న డెంగ్యూ

- వరద ప్రభావిత ప్రాంతాల్లో పెరుగుతున్న కేసులు
- చింతూరు ఏరియా ఆస్పత్రిలో నెలలో 132 నమోదు
- అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- పూర్తిస్థాయిలో వైద్యుల నియామకానికి ఏర్పాట్లు



చింతూరు ఏరియా ఆస్పత్రిలో ఓపీ వద్ద వేచి ఉన్న రోగులు

చింతూరు : ఇటీవల వరద ముంపునకు గురైన చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో డెంగీ జ్వరాలు అధికంగా నమోదవుతున్నాయి. ప్రధానంగా చింతూరు మండలంలో గత నెలలో 132 కేసులు నమోదవడం డెంగీ జ్వరాల తీవ్రతను తెలియజేస్తుంది. గత నెల ఒకటి నుంచి 31 వరకు 132 కేసులు నమోదయ్యాయి. ఏరియా ఆస్పత్రిలో 55 మందికి పరీక్షలు నిర్వహించగా 36 పాజిటివ్ కేసులు వచ్చాయి. చింతూరులోని ప్రైవేటు ల్యాబ్‌ల్లో పరీక్షలు నిర్వహించుకున్న వారిలో 96 మందికి డెంగ్యూ నిర్ధారణ అయింది. వీరంతా చింతూరు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

రోజూ ఐదు నుంచి పది కేసులు..

చింతూరు ఏరియా ఆస్పత్రిలో ప్రతి రోజు 260కు పైగా ఓపీ ఉండగా నిత్యం ఐదు నుంచి 10 డెంగీ కేసులు పాజిటివ్‌గా తేలుతున్నాయని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం చింతూరు ఏరియా ఆస్పత్రిలో డెంగీ జ్వరాలతో 26 మంది చికిత్స పొందుతున్నారు. వీరితో పాటు నాలుగు మండలాల్లోని చాలా మంది రోగులు ప్రైవేటు ఆస్పత్రులతో పాటు భద్రాచలం, కొత్తగూడెం, రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా డెంగ్యూ జ్వరాలకు చికిత్స తీసుకుంటున్నారు. డెంగ్యూ జ్వరాలతో ఇటీవల చింతూరు మండలంలోనే ఐదుగురు మృత్యువాత పడ్డారు. ఏరియా ఆస్పత్రిలో డెంగ్యూ నిర్ధారణ కిట్లు ఉన్నాయి. అయితే ప్లేట్‌లెట్స్ నిర్ధారించే పరికరం మరమ్మతులకు గురికావడంతో రోగులు ప్రైవేటు ల్యాబ్‌ల్లో పరీక్షలు చేయించుకుంటున్నారు.

నాలుగు మండలాల్లో..

నాలుగు మండలాల్లో ఒక ఏరియా ఆస్పత్రి, ఒక సీహెచ్‌సీతో పాటు పది పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో 30 మంది వైద్యులకు గాను ప్రస్తుతం పది మంది మాత్రమే ఉన్నారు. చింతూరు ఏరియా ఆస్పత్రిలో ప్రతి మూడు రోజులకోసారి తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల నుంచి డిప్యుటేషన్‌పై వైద్యులు వచ్చి వెళ్తున్నారు. దీంతో రోగులకు సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు పడాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు.

ఇలా చేపడితే..

వరదల అనంతరం డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందాయి. దీని కోసం వరద ముంపునకు గురైన ప్రతి గ్రామంలో తక్షణమే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. గ్రామాల్లో ఫాగింగ్‌తో పాటు మురుగు గుంటల్లో యాంటీ లార్వా కార్యక్రమాలు చేపట్టాలి. ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత లేకుండా రెగ్యులర్ వైద్యులను నియమించాల్సిన అవసరం ఉంది. ప్రతి ఆస్పత్రిలో డెంగ్యూ నిర్ధారణకు కోసం ఆర్‌డీటీ కిట్లతో పాటు చింతూరు ఏరియా ఆస్పత్రి, కూనవరం పీహెచ్‌సీలో ప్లేట్‌లెట్ నిర్ధారణ పరికరాలను అందుబాటులో ఉంచాలి. డెంగ్యూ నిర్ధారణకు నిర్వహించే ఎలీషా టెస్టులను దగ్గరలోని రంపచోడవరంలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. వీటితో పాటు డెంగ్యూ జ్వరాలు అధికంగా నమోదవుతున్న గ్రామాల్లో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహించి రక్తపూతలు సేకరించి డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంది.

వైద్యుల నియామకానికి చర్యలు

ఏరియా ఆస్పత్రిలో రెగ్యులర్ వైద్యులు లేక ఇతర ప్రాంతాల నుంచి డిప్యుటేషన్‌పై రప్పించి వైద్య సేవలు అందిస్తున్నాం. రెగ్యులర్ వైద్యుల నియామకానికి ఉన్నతాధికారుల ద్వారా చర్యలు తీసుకుంటున్నాం. డెంగ్యూ జ్వరాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ పుల్లయ్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, చింతూరు

గౌరీ తనయా.. నమోనమః



పాడేరు గుడివాడ చావడిలో కొలువుదీరిన మట్టి గణనాథుని విగ్రహం

గౌరీ తనయుడు గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో సందడి నెలకొంది. మండపాల్లో విగ్రహాలను పోటాపోటీగా ఏర్పాటుచేసి ఉత్సవాలను అట్టహాసంగా అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల మట్టితో తయారుచేసిన విగ్రహాలను నెలకొల్పి పూజలు చేశారు. కొన్ని గ్రామాల్లో ఉత్సవాలను ఒకరోజుకు మాత్రమే పరిమితం చేసి ఊరేగింపుగా విగ్రహాలను తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి, పాడేరు

కేజీబీవీల్లో సీఆర్టీ, పీజీటీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

సాక్షి, పాడేరు : జిల్లాలో కస్తూర్బా విద్యాలయాల్లో సీఆర్టీ, పీజీటీ ఖాళీలను గెస్ట్ విధానంలో గంటల ప్రాతిపదికన ఈ విద్యాసంవత్సరానికి భర్తీ చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్రశిక్ష జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.రమేష్ తెలిపారు. అన్ని కేజీబీవీల్లోను పోస్టుల ఖాళీల వివరాలను నోటీసు బోర్డుల్లో పొందుపర్చామని ఆయన తెలిపారు. పదవీ విరమణ పొందిన మహిళా స్కూల్ అసిస్టెంట్లు, లెక్చరర్లకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. వారికి కచ్చితంగా సమగ్రశిక్ష నిబంధనలకు అనుగుణంగా వారి విద్యార్హతలు ఉండాలన్నారు. పదవీ విరమణ పొందిన మహిళా ఉపాధ్యాయులు లేకుంటే డిగ్రీ, పీజీలో కనీసం 50శాతం మార్కులు, బీఈడీ ఉత్తీర్ణత పొంది బోధనలో అనుభవం ఉన్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను ధ్రువీకరణ పత్రాలతో జిల్లాలోని అన్ని కేజీబీవీల్లోను ఈ నెల రెండు నుంచి ఏడవ తేదీ వరకు అందజేయాల్సి ఉంటుందన్నారు. కేజీబీవీల్లోని ప్రత్యేకాధికారులు, ప్రిన్సిపాళ్లకు నేరుగా దరఖాస్తులు అందజేయాలని, దరఖాస్తులన్నింటిని వారు జిల్లా స్థాయి ఎంపిక కమిటీకి పంపుతారని, ఒక పోస్టుకు ఒకటి కన్నా ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్టయితే జిల్లా స్థాయి కమిటీ సమక్షంలో డెమో క్లాస్ నిర్వహించి ఖాళీలను భర్తీ చేస్తామని డీఈవో తెలిపారు.

కానుక కురిపింఛెన్

తొలిరోజు 4.59 లక్షల మందికి పింఛన్



టీబీ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న మన్యాల లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్యామ్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలో సెప్టెంబర్ నెల వైఎస్సార్ పింఛను కానుక సంబరంగా మొదలైంది. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. లబ్ధిదారుల కళ్లల్లో నెల ప్రారంభ తేదీ రోజునే ఆనందం చూడాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా అధికారయంత్రాంగం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 5,37,971 మంది పెన్షన్ లబ్ధిదారులుండగా తొలిరోజున 4,59, 582 మందికి పింఛన్ అందించారు. మొత్తం రూ.136.88 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా తొలిరోజున రూ.116.87 కోట్లు లబ్ధిదారులకు అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో నెట్‌వర్క్ సౌకర్యం సరిగా లేకపోవడం వల్ల.. పింఛను అప్‌డేట్ చేసే ప్రక్రియ ఆలస్యంగా జరుగుతోందని అధికారులు తెలిపారు. లబ్ధిదార్లకు పింఛన్లు అందజేసే సమయంలో గుర్తింపు కోసం బయోమెట్రిక్, ఐరిస్ విధానాలను అమలు చేశారు. ఆర్‌బీఐఎస్ (రియల్ టైమ్ బెనిఫిషరీష్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్) విధానాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయంలోని కాల్ సెంటర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అధికారులు పర్యవేక్షించారు.

జిల్లా	లబ్ధిదారులు	పంపిణీ	అందించిన నగదు(రూ.లలో)
విశాఖపట్నం	1,59,726	1,46,500	37,93,01,000
అనకాపల్లి	2,55,229	2,24,000	56,44,00,500
అల్లూరి సీతారామరాజు	1,21,372	89,082	22,50,00,500
మొత్తం	5,36,327	4,59,582	116,87,02,000

గిరి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- 90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాల పంపిణీ



రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఎంపీపీ, సర్పంచులు



జి.మాడుగులలో రాజ్‌మా విత్తనాలను అందజేస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి



విత్తనాలను పంపిణీ చేస్తున్న హలియారాణి

సాక్షి, పాడేరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గిరి రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని, వారి ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. 90శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని గుత్తులపుట్టు రైతు భరోసా కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు పంచాయతీలకు చెందిన సుమారు 1300 మంది గిరిజన రైతులకు 20 కిలోల చొప్పున రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాజ్‌మా పంటను ప్రభుత్వం ప్రోత్సహించే విధంగా ఇంత పెద్ద మొత్తంలో సబ్సిడీని భరించి జిల్లాకు అతి తక్కువ ధరకు 4600 క్వింటాళ్లు పంపిణీ చేయడం శుభపరిణామన్నారు. సుమారు రూ.3వేల ఖరీదైన 20 కిలోల రాజ్‌మా బస్తాను రూ.290లకే పంపిణీ చేస్తున్నామన్నారు. వీటిని బయట మార్కెట్లో విక్రయిస్తే వచ్చే ఏడాది విత్తనాలు పంపిణీ నిలిపివేస్తామన్నారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి, వ్యవసాయశాఖ ఏడీ సూర్యప్రకాష్, ఎంపీటీసీలు దూసురు సన్యాసయ్య, లకే రామకృష్ణ పాత్రుడు, నర్సింహమూర్తి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బసవన్నదొర, పలు పంచాయతీల సర్పంచులు జి.నీలకంఠం, సీదరి రాంబాబు, కె.ఈశ్వరమ్మ, కె.సన్నిబాబు, ఎల్.పార్వతమ్మ, వి.సీతమ్మ, మాజీ ఎంపీపీలు సీదరి మంగ్లన్నదొర, ఎస్వీ రమణమూర్తి, పార్టీ నాయకులు దశమూర్తి, కోడా సుశీల, కె.బొంజుబాబు, మండల వ్యవసాయ అధికారి సూర్యకుమారి,ఏఈవోలు మతం సూర్యనారాయణ నాయుడు, పార్వతి పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలానికి మంజూరైన పది టన్నుల రాజ్‌మా విత్తనాలను గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ పంచాయతీకు 90శాతం సబ్సిడీపై రెండు టన్నుల చొప్పున 34 టన్నుల విత్తనాలకు ప్రతిపాదించగా ఇప్పటివరకు 10 టన్నులు పంపిణీ జరిగిందని చెప్పారు. మండలంలో బొయితిలి, కిల్లంకోట, నుర్మతి, భీరం, సింగర్బ, కోరాపల్లి, పెదలువ్వాసింగి, జి.మాడుగుల, కె కోడాపల్లి, కుంబిడిసింగి పంచాయతీలకు ఒక్కొక్క టన్ను చొప్పున ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నామని ఆమె తెలిపారు. అనంతరం నుర్మతి రైతు భరోసా కేంద్రంలో రాజ్‌మా విత్తనాలు పంపిణీని పరిశీలించారు. ఎంపీపీ కొర్రా పద్మ, పాడేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి, ఎస్‌ఐ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు(బుజ్జి),వైస్ ఎంపీపీ కె సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి రవీంద్రబాబు పాత్రుడు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, జి.మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు, సర్పంచ్‌లు గంగరాజు, వెంకట్ పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జల్లి హలియారాణి అన్నారు. లంబసింగి పంచాయతీ జల్లూరిమెట్టలో గురువారం రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల అవినీతిపై విచారణ

కొయ్యూరు: ఆడాకుల పంచాయతీ రామ్‌నగర్‌లో వ్యక్తిగత మరుగుదొడ్ల (ఐఎస్‌ఎల్)నిర్మాణంలో అవినీతి జరిగిందని అందిన ఫిర్యాదు మేరకు గురువారం ఎంపీడీవో మేరీరోజ్, ఏపీవో రాజు విచారణ నిర్వహించారు. మరుగుదొడ్లు కట్టకుండానే నిధులను స్వాహా చేశారని గ్రామం నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపీడీవో,ఏపీవోలను ఆదేశించారు.ఈ మేరకు వారు రామ్‌నగర్‌లో విచారణ జరిపారు. మొత్తం పది ఇళ్లను పరిశీలించారు. మరుగుదొడ్లు నిర్మించలేనట్టుగా నిర్ధారణ అయినట్టు సమాచారం. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, దీనిపై తదుపరి చర్యలు వారు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

ప్రకృతి అందాల కనువిందు








ప్రముఖ పర్యాటక కేంద్రం అరకు – అనంతగిరి ఘాట్‌మార్గంలో గాలికొండ వ్యూపాయింట్ వద్ద ప్రకృతి అందాలు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. గురువారం




ఉదయం తరలివచ్చిన పర్యాటకుల సెల్‌ఫోన్లలో వీటిని బంధించారు. మలుపుల వద్ద మంచు అందాలను తిలకించారు.

– అరకు రూరల్



మేఘాలు, మంచు అందాల నిలయంగా విశ్వవ్యాప్తి పొందిన పాడేరు మండలం వంజంగి హిల్స్‌లో గురువారం ప్రకృతి కనువిందు చేసింది. పర్యాటకులు బుధవారం రాత్రే వంజంగి హిల్స్‌కు చేరుకుని కల్లాలబయలు, బోనంగమ్మ



పర్వతంపై గుడారాలు వేసుకుని బస చేశారు. తెల్లవారుజాము 4.30గంటల సమయంలో సూర్యోదయం అందాలు పర్యాటకులను అబ్బురపరిచాయి. ఉదయం పది గంటల వరకు మంచుతెరలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి, పాడేరు

లక్ష్యంతో చదివితే విజయం సొంతం

- గిరిజన విద్యకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సౌకర్యాలు
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి


గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాల విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివితే విజయం సొంతమవుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరుపట్టీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల్లో బోధన, మౌలిక సదుపాయాలు, భోజనం పంపిణీ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు బాగున్నాయని టెన్త్ విద్యార్థులు చెప్పడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

గిరిజన విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్మించుకొని, తదనుగుణంగా అభ్యసించి, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, గిరిజన విద్యాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందుబాటులో తెచ్చిన అన్ని విద్యా సౌకర్యాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువును మధ్యలో మానివేయడం, తరచూ ఇళ్లకు వెళ్లడం వంటి పరిస్థితులకు దూరంగా ఉండాలని హితవుపలికారు. ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా తక్షణమే ఉపాధ్యాయులకు తెలియజేసి సకాలంలో వైద్య సేవలు పొందాలన్నారు. అనంతరం హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే మాట్లాడారు. పాఠశాలకు అవసరమైన సౌకర్యాలపై కూడా ఎమ్మెల్యే ఆరా తీశారు. ఎంపీపీ ఎస్.రత్నకుమారి, సర్పంచులు రాంబాబు, నీలకంఠం, సన్నిబాబు, పార్వతమ్మ, మాజీ ఎంపీపీలు మంగ్లన్నదొర, రమణమూర్తి, హెచ్‌ఎం సింహచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాల సమస్యలు పరిష్కరిస్తా

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. కళాశాలలో అధ్యాపకులను నియమించాలని విద్యార్థినులు చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల నేపథ్యంలో సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే స్పందించారు. ఈ మేరకు ఆయన కాలేజీని గురువారం సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల పరిసరాలను పరిశీలించి అందుబాటులోకి తేవాల్సిన సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ కళాశాలలో త్వరలో పూర్తిస్థాయి అధ్యాపకుల నియామకానికి సీఎం, విద్యాశాఖ మంత్రులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. విద్యార్థినులు శాంతియుతంగానే ఉండాలని, ప్రభుత్వం అన్ని సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. నాడు-నేడు నిధుల ద్వారా రూ.25లక్షలతో అదనపు తరగతి గదులు, టాయ్‌లెట్‌ల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.25లక్షలు మంజూరు చేయించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొర్రా గాసి, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ సభ్యులు భీమరాజు, రామచందర్, పీఏసీఎస్ చైర్మన్ హస్తినకుమార్, సర్పంచ్ భాస్కరరావు, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ రహ్మతుల్లా, నాయకులు అర్జున్, రఘునాథ్, అప్పాలు, బాలరాజు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు 14500 టోల్‌ఫ్రీ

- ఆపరేషన్ పరివర్తనకు మంచి స్పందన
- అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్

అనకాపల్లి టౌన్ : జిల్లాలో నాటుసారాను నిర్మూలించేందుకు ఆపరేషన్ పరివర్తన -2లో భాగంగా 14500 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్టు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జె.రవికుమార్ అన్నారు. మండలంలో తుమ్మపాల పంచాయతీ ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నాటుసారా, గంజాయి, మాదకద్రవ్యాలు అక్రమ రవాణాకు పాల్పడినట్లయితే టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. జిల్లాలో ఏడుస్టేషన్‌ల పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు 1,367 కేసులు నమోదు చేసి 950 మందిని అదుపులోకి తీసుకొని, 46 వాహనాలు సీజ్ చేసినట్టు చెప్పారు. 4,700 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్టు చెప్పారు. నాటుసారా తయారీదారులు, నల్లబెల్లం వర్తకులు ఇరువురు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలించిన పిదప వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. నేటి వరకు జిల్లాలో నర్సీపట్నం, పాయకరావుపేట ప్రాంతాల్లో ముగ్గురు వర్తకులపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఆపరేషన్ పరివర్తన-2 ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభించి ఆపరేషన్-2కు మంచి స్పందన లభించిందన్నారు. ఇప్పటికే 400 కుటుంబాలు సారా తయారు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. వీరికి జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో ప్రత్యేక జీవనోపాధికి కోసం చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న 351 మందిపై బైండోవర్, గంజాయి రవాణా చేసిన 9 మందిపై మాడుగుల స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఈనెల 6వతేదీన ఉదయం అనకాపల్లి ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 40 వాహనాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వేలంలో పాల్గొనే పాటదారులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. అదేరోజు మధ్యాహ్నం చోడవరం, 7న నర్సీపట్నంలోను వాహనాలను వేలం వేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ అనురాధదేవి, ఎస్ఐ కె.శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి బస్సులో మంటలు


ఘాట్ రోడ్డులో అర్ధరాత్రి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

సీలేరు : మధురవాడ డిపోకు చెందిన ఏపీ 31 జెడ్ 0340 నంబర్ గల విశాఖపట్నం నుంచి భద్రాచలానికి వెళ్తుండగా గురువారం తెల్లవారు జాము 3గంటల సమయంలో ఘాట్‌రోడ్డులో ప్రయాణిస్తున్న సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో బస్సు సిబ్బంది, ప్రయాణికులు భయాందోళన చెంది బస్సును నిలుపుదల చేసి కిందికి దిగిపోయారు. సిబ్బంది ధైర్యం చేసి బస్సులో పరిశీలించగా బ్రేకు పైపులు విరిగిపోవడంతో మంటలు వచ్చినట్టు గుర్తించారు. దీంతో సాంకేతిక మరమ్మతులు చేసి బ్రేకు పైపును డమ్మి చేసి కొంత దూరం తీసుకువచ్చారు. బస్సు చిన్న గోతిలో దిగడంతో మరల బస్సు నిలిచిపోయింది. తర్వాత బస్సును ప్రయాణికులంతా నెట్టడంతో భద్రాచలంకు ప్రయాణమయ్యింది. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు.

సాయిబాబా విగ్రహావిష్కరణ


సాక్షి, పాడేరు : పాడేరు ఘాట్‌లో వంకచింత జలపాతం వద్ద 12 అడుగుల షిర్డీ సాయిబాబా విగ్రహాన్ని గురువారం రాత్రి ప్రతిష్ఠించారు. భీమిలిలోని సద్గురు ఆశ్రమం ప్రతినిధి సాయిరాం ఈ విగ్రహాన్ని వితరణ చేశారు.

దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసులు

ఎటపాక : కన్నాయిగూడెం గ్రామంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఎటపాక పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత కక్షల కారణంగా గత నెల 30న రాత్రి సీపీఐకి చెందిన వారిగా చెపుతున్న డి. రమేష్, సత్యనారాయణ కన్నాయిగూడెం ఎంపీటీసీ వర్స బాలకృష్ణ ఇంటికి వెళ్లి దాడికి పాల్పడినట్టు తెలిపారు. ఈ దాడుల్లో కొందరికి గాయాలయ్యాయి. ఇరువర్గాలు 31న ఎటపాక పోలీస్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. అయితే తనపై గిరిజనేతరులు ఇంటివద్దకు వచ్చి తనను కులంపేరుతో దూషించి దాడిచేసినట్టు ఎంపీటీసీ బాలకృష్ణ, తన సోదరుడు శివరామకృష్ణ ఫిర్యాదు చేయడంతో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఏఎస్పీ మహేశ్వరరెడ్డి గురువారం కన్నాయిగూడెం గ్రామం వెళ్లి విచారణ చేపట్టారు.


కన్నాయిగూడెంలో విచారణ చేపడుతున్న ఏఎస్పీ

జ్వరంతో బాలిక మృతి

కుయిగురులో ఘటన

చింతూరు: జ్వరం, వాంతులు, విరేచనాలతో బాలిక మృతి చెందింది. మండలంలోని కుయిగురులో ఈఘటన చోటు చేసుకుంది. కుయిగురు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కారం ఏసుబాబు కుమార్తె సంధ్య (10)కు బుధవారం మధ్యాహ్నం నుంచి జ్వరంతో పాటు వాంతులు, విరేచనాలు అవుతుండడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక వైద్యం చేసిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని భద్రాచలం ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో బాలికను రాత్రి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరద ప్రాంతాల పర్యటనలో భాగంగా కుయిగురు గ్రామం వచ్చినప్పుడు ఆమె ఉత్సాహంగా పాల్గొంది. ఇంతలోనే ఆ బాలిక అనారోగ్యానికి గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ పి.కమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎగుమంతి రామలింగారెడ్డి, కోట్ల కృష్ణ, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చింతూరు ఏరియా ఆస్పత్రిలో రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వైద్యులను నియమించాలని వారు కోరారు. బాలిక మృతితో గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించి ప్రతి ఇంటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో ఉన్నవారి రక్తపూతలు సేకరించి కొంతమందిని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వో వివరణ: కారం సంధ్యకు డెంగ్యూ ఎన్ఎస్-1 జ్వరం ఉండగా ప్లేట్‌లెట్స్ లక్షకు పైగా ఉన్నాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు. జ్వరంతో పాటు వాంతులు, విరేచనాలు అవుతుండడంతో భద్రాచలంలోని ప్రైవేట్ పిల్లల ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడి డాక్టర్ పరీక్షించి ప్రభుత్వ ఆస్పత్రికి పంపారన్నారు. అక్కడ ఫిట్స్ కూడా రావడంతో చికిత్స పొందుతూ బాలిక మృతి చెందిందని తెలిపారు. వైరల్ మెనింగో ఎన్సెఫలైటీస్ అనే వ్యాధితో బాలిక మృతి చెందినట్లు పిల్లల వైద్యులు నిర్ధారించారని ఆయన పేర్కొన్నారు.


బాలిక సంధ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తమ్ముడిని హతమార్చిన అన్న

- చంపి పాతిపెట్టిన వైనం
- మృతుని భార్య ఫిర్యాదుతో వెలుగులోకి..
- భూతగాదాయే కారణం

హుకుంపేట : భూతగాదాలో తమ్ముడిని హత్య చేసి ఎవరికీ తెలియకుండా పాతి పెట్టిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హుకుంపేట మండలం రంగశీల పంచాయతీ కేంద్రానికి చెందిన కిల్లో కృష్ణ, కిల్లో జయరామ్ అన్నదమ్ములు. తండ్రికి భూమిపై వచ్చే రైతు భరోసా నగదు కోసం గొడవపడేవారు. మూడేళ్ల క్రితం భూతగదాలు చేసుకుని, రైతు భరోసా డబ్బుల్లో వాటా కావాలని అడిగితే నాటు తుపాకీతో తమ్ముడి భార్య అయిన కొండమ్మ చేతిపై బావ కృష్ణ కాల్చాడు. ఆ కేసులో జైలు శిక్ష కూడా అనుభవించి వచ్చాడు. మళ్లీ ఈ ఏడాది రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని అడిగిన తమ్ముడు కిల్లో జయరామ్(35)ను అన్న కొట్టి హత్యచేసి గ్రామ చివార కొండప్రాంతంలో తన భూమిలో పాతిపెట్టాడు. గత నెలరోజులుగా భర్త కనిపించకపోవడంతో కూలి పనులకు వెళ్లి ఉంటాడని భార్య కొండమ్మ అనుకుంది. అనుమానంతో ఈ నెల 28వ తేదీన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక ఎస్ఐ నాయుడు దర్యాప్తు నిర్వహించారు. అన్న తమ్ముడిని చంపి పాతిపెట్టిన విషయం తెలుసుకుని పాడేరు సీఐ సుధాకర్, రిస్క్యూ టీమ్, రెవిన్యూ అధికారులు కలిసి మృత దేహాన్ని బయటకు తీశారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడిని అదుపులో తీసుకున్నామని సీఐ సుధాకర్ తెలిపారు. మృత దేహాన్ని పాతిపెట్టిన ప్రదేశంలో ఎవరికీ అనుమానం రాకుండా పూడ్చి పెట్టిన ప్రదేశంలో పచ్చిమిర్చి మొక్కలు నాటాడని ఆయన తెలిపారు. మృతి చెందిన జయరామ్‌కు భార్యతో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.


పాతి పెట్టిన మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

కారులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం


డొంకరాయి స్టేషన్ వద్ద పట్టుబడిన నిందితులు

మోతుగూడెం : డొంకరాయి పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద గురువారం నిర్వహించిన తనిఖీల్లో గంజాయి పట్టుబడినట్టు ఎస్ఐ తెలిపారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో సీలేరు నుంచి వస్తున్న వాహనాన్ని (కారు)ను ఆపి తనిఖీ చేయగా 30 కేజీల గంజాయి పట్టుబడిందని, కారులోని ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు తెలిపారు. పట్టుబడిన వారిలో చిత్రకొండకు చెందిన గలారి జయరామ్, మల్కన్‌గిరికు చెందిన అజయ్‌కుమార్‌రామ్, హైదరాబాద్‌కు చెందిన కరక ప్రద్యుమ్న, నిజామాబాద్‌కు చెందిన నీలం ప్రణయ్ కుమార్, హర్షవర్ధన్‌లు ఉన్నట్టు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు ఫోన్‌లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.

పరారైన గంజాయి నిందితుడు అరెస్టు

ముంచంగిపుట్టు : గంజాయి రవాణా కేసులో గతంలో పరారైన నిందితుడిని ముంచంగిపుట్టు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రవీంద్ర విలేకర్లకు అందించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం మండల కేంద్రం నుంచి జోలాపుట్టు వెళ్లే మార్గంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ ఉండగా కించాయిపుట్టు నుంచి మండల కేంద్రానికి కాలినడక వస్తున్న యువకుడు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. దీనిని గమనించిన పోలీసులు అతనిని పట్టుకొని విచారించగా 2022 సంవత్సరం జూన్ 3వ తేదీన మండలంలో గల బంగారుమెట్ట పంచాయతీ కేంద్రం సమీపంలో 120 కిలోల గంజాయి రవాణా కేసులో ఉండి పరారైన సునేంద్రగా గుర్తించారు. అప్పట్లో గంజాయి అక్రమ రవాణాలో ఎనిమిది మంది అరెస్టు కాగా, సునేంద్ర పరారాయ్యాడు. పట్టుబడ్డ నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించడం జరిగిందని ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

వరద బాధితులందరికీ న్యాయం

- సర్వేలో లోపాలుంటే సవరించాలి
- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న సూరజ్ గనోరే

వీఆర్‌పురం: ఇటీవల సంభవించిన వరదలకు ఇళ్లు కోల్పోయిన వరద బాధితులందరికీ ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో (ప్రత్యేకాధికారి) సూరజ్ గనోరే సూచించారు. గురువారం ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌పురం, కూనవరం మండలాల అధికారులతో వరద నష్టం సర్వేపై సమీక్షించారు. గ్రామాల వారీగా సిబ్బంది చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. వరద నష్టం సర్వేపై అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో సచివాలయ వారీగా ప్రత్యేకాధికారులను నియమిస్తునట్లు ఆయన తెలిపారు. గతంలో జరిపిన సర్వేలో లోపాలు ఉంటే సవరించి అర్హులను జాబితాలో చేర్చాలన్నారు. పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎస్.శ్రీధర్,ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎం.రత్నకుమారి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి : ఇటీవల వరదలకు మండల వ్యాప్తంగా తీవ్ర నష్టం జరిగిందని మండలాన్ని యూనిట్‌గా తీసుకొని వరద నష్టపరిహారం ప్రజలందరికీ అందేలా చూడాలని పలు రాజకీయ పార్టీల నేతలు ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరేకు వినతి పత్రం అందజేశారు. వడ్డిగూడెం, వీఆర్‌పురం గ్రామాలను 41.5 కాంటూరులో చేర్చి పోలవరం నష్టపరిహారం ఇవ్వాలని పేర్కొన్నారుజ. రేఖపల్లి గ్రామాన్ని పోలవరం ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరారు.

స్కిల్ హబ్‌లతో శిక్షణ, ఉపాధి

- నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, పాడేరు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాడేరు ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల, రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.రోహిణి తెలిపారు. పాడేరు స్కిల్ హబ్‌లో 30 మంది నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో, రంపచోడవరంలో 30 మందికి జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు డిగ్రీ పూర్తి చేసి 18-35 ఏళ్లలోపు యువతీ, యువకులు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుకు టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణులైన యువతీ,యువకులు అర్హులన్నారు. ఈ నెల ఐదవ తేదీలోగా ఆసక్తిగల వారంతా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 12 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని ఆమె పేర్కొన్నారు. కంప్యూటర్ కోర్సు శిక్షణ వివరాలకు 9014767230, 6302636174, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుకు 8179613081, 8331890681 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామని ఆమె తెలిపారు.

పరుగు పందెంలో గిరి విద్యార్థి ప్రతిభ

అండర్-12లో బంగారు పతకం సాధన

అనంతగిరి: మండల కేంద్రం బొడ్డచెట్టు కాలనీకి చెందిన బడిమెల యశ్వంత్‌తేజ్ అండర్-12 పరుగుపందెంలో ప్రతిభ కనబరిచి బంగారుపతకం సాధించాడు. యూత్‌గేమ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గతనెల 26 నుంచి 30 వరకు నేపాల్ పోకరలో సెకెండ్ యూత్ ఇండోనేపాల్ అంతర్జాతీయ 2022 సిరీస్ పోటీలు నిర్వహించారు. వీటిలో పాల్గొన్న యశ్వంత్‌తేజ్ బంగారుపతకం సాధించి, సత్తాచాటాడు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యశ్వంత్‌ను తండ్రి శేఖర్, కోచ్ రాజబాబు తదితరులు అభినందించారు. గతనెల జూలైలోని హర్యానాలో జరిగిన 46 జాతీయ యూత్ గేమ్స్ నేషనల్ చాంపియన్‌షిప్ అండర్-12 విభాగంలోని పరుగు పందెంలో పాల్గొని, బంగారుపతకం సాధించాడు.

యువతిని మోసగించిన యువకుడి అరెస్టు

చీడికాడ : పెళ్లి పేరిట యువతిని మోసగించి అటు తరువాత మరోపెళ్లికి సిద్ధమైన యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చోడవరం సీఐ జి.తాతారావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన గురువారం అందించిన వివరాలిలా ఉన్నాయి. బైలపూడికి చెందిన గాడి శ్రీను అనే యువకుడు తన ఇంటి సమీపంలో గల యువతిని పెళ్లి పేరిట మోసగించి సహజీవనం చేశాడు. పెళ్లి చేసుకోవాలని శ్రీనును యువతి కోరడంతో ముఖం చాటేసి మరో పెళ్లి సిద్ధపడ్డాడు. ఈమేరకు యువతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి యువకుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు సీఐ చెప్పారు. సమావేశంలో ఎస్ఐ సుధాకరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

డుంబ్రిగుడ: అరకు–పాడేరు ప్రధాన రోడ్డు సమీపంలోని కురిడి పంచాయతీలో పెద్ద బ్రిడ్జి వద్ద గురువారం కారు ప్రమాదం జరిగింది. డుంబ్రిగుడ నుంచి అరకులోయ వెళ్తున్న కారు (ఏపీ39బిహెచ్7530) అదుపు తప్పి బ్రిడ్జి గోడను ఢీకోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. కారులో నలుగురు ప్రయాణిస్తున్నారని, సురక్షితంగా బయటపడ్డారని స్థానికులు తెలిపారు. బ్రిడ్జికి కింద పడి ఉంటే కారులో వ్యక్తులు మృతి చెందేవారని చెప్పారు. ఈ ప్రమాదంపై తమకు ఎటువంటి సమాచారం లేదని పోలీసులు చెబుతున్నారు.

సమయపాలన తప్పనిసరి



విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: సంతారి గ్రామ సచివాలయం, పాఠశాల, చినబూరుగుపుట్టు, కుక్కిస పాఠశాలల్లో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం గురువారం సందర్శించారు. చినబూరుగుపుట్టు పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. సచివాలయ కేంద్రాల ద్వారా గిరిజనులకు పథకాలు అందేలా చూడాలన్నారు. సర్పంచ్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు పనుల పరిశీలన



చెక్‌పోస్టు ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో చెక్‌పోస్టును ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గంజాయి, సారా తదితర రవాణా అడ్డుకట్టకు చెక్‌పోస్టు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. గస్తీ నిర్వహించి, ముమ్మరంగా వాహనాలు తనిఖీ నిర్వహిస్తామన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పెదబయలు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ–1 కేంద్రాన్ని సీడీపీవో రాజ్యలక్ష్మి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. సూపర్‌వైజర్లు తదితరులున్నారు.

సురవరంలో వైద్య శిబిరం

గూడెంకొత్తవీధి: పెదవలస పీహెచ్‌సీ పరిధిలోని సురవరం గ్రామంలో వైద్యాధికారి సురేఖ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 120 మంది రక్తపూతలు సేకరించారు. వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 10 మందికి వైరల్ జ్వరాలున్నట్టు గుర్తించారు. మందులు పంపిణీ చేసినట్టు వైద్యాధికారి చెప్పారు. జ్వరాలు సంభవిస్తే పీహెచ్‌సీకి సమాచారం అందించాలని, నిల్వ ఉంచిన ఆహారం తీసుకోద్దని, వేడి నీటినే తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెల్త్ ఎగ్జిక్యుటర్ శ్రీనివాస్, హెచ్‌వీ దేవమణి, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.రత్నం, ఏఎన్‌ఎం సత్యవతి, హెచ్‌ఏ కోటయ్య పాల్గొన్నారు.

ఉన్నత విద్య అభ్యసించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ దేముడుబాబు

అరకులోయ : గిరిజన విద్యార్థులు బాగా చదవుకొని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సీఐ జి.దేముడుబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను గురువారం సందర్శించి విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టి సారించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను వివరించారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

- గ్రామాల్లో పండగ సందడి
- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు



అనంతగిరిలో కొలువైన గణనాథుడు

సాక్షి,పాడేరు/అనంతగిరి/డుంబ్రిగుడ/పెదబయలు/ముంచంగిపుట్టు/గూడెంకొత్తవీధి/కొయ్యూరు/సీలేరు/చింతపల్లి/గంగవరం/రాజవొమ్మంగి/ఎటపాక/వై.రామవరం/వీఆర్ పురం/అడ్డతీగల: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని చోట్ల వినాయక చవితి పండగను బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. నివాస గృహాల్లోను, గ్రామాల్లోని ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో గణనాథుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండలపాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. పోటా పోటీగానే పెద్ద సైజు విగ్రహాలను కొలువుదీర్చారు. కొన్ని ప్రాంతాల్లో పొలాల నుంచి సేకరించిన మట్టితో విగ్రహాలను ఏర్పాటుచేసి పూజలు చేశారు. కొన్నిచోట్ల సమీప గెడ్డలు, రిజర్వాయర్‌లలో గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఊరేగింపులో థింసా నృత్యాలతో సందడి చేశారు. చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్.పురం ప్రాంతాల్లోని భక్తులు శబరి, గోదావరి నదుల్లో గణపతి విగ్రహాలను నిమజ్జనం జరిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. గ్రామాల్లో భారీ అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం పాడేరు మండలం పనసపల్లి, గబ్బంగి, జీసీసీ వెనుక కాలనీతో పాటు వివిధ మండలాల్లో అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా చాలా చోట్ల పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



అడ్డతీగలలో కొలువుదీరిన గణనాథునికి పూజలు చేస్తున్న భక్తులు



రాజవొమ్మంగి అప్పలరాజుపేటలో మట్టితో చేసిన వినాయకుని విగ్రహం



జంగంసరియాలో గణనాథుడికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర,మూర్తి దంపతులు



ముంచంగిపుట్టులో ఆకట్టుకున్న వినాయకుడి విగ్రహం



వై.రామవరం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వీఆర్ పురం మండలం రేఖపల్లిలో గణనాథునికి పూజలు చేస్తున్న భక్తులు



పాడేరు చిలకలమామిడి గెడ్డలో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



డుంబ్రిగుడలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



పెదబయలులో పూజలు చేస్తున్న భక్తులు



చింతపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు



గంగవరంలో పూజలు చేస్తున్న భక్తులు



జీకే వీధిలో వినాయకుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఎటపాక మండలం గన్నవరం వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. లోతుగెడ్డ పంచాయతీ తురుతుంపాడు, పిసిరిమామాడి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 163 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. సకాలంలో, సక్రమంగా పథకాలు అమలవుతున్నాయని, రానున్న ఎన్నికల్లో తామంతా జగనన్నకు ఓటు వేస్తామని గ్రామస్తులు నినాదించడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు పాలన మరింత చేరువ చేశారన్నారు. వలంటీర్ల ద్వారా ప్రతి నెల ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటికే పింఛన్ పంపిణీ జరుగుతోందన్నారు. గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జల్లి హలియారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, లోతుగెడ్డ సర్పంచ్ సునిల్, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ పాల్గొన్నారు.



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

ఆత్మీయ సన్మానం



ఎంపీడీవోలను సత్కరిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి



జి.మాడుగుల ఎంపీడీవో లోహిత్ జయకుమారిను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు

అనంతగిరి: మండల కేంద్రంలో ఎంపీడీవోగా గురువారం బాధ్యతలు స్వీకరించిన శ్రీహర్షిత్‌కు ఎంపీపీ శెట్టి నీలవేణి తదితరులు ఘనంగా సన్మానించారు. గతంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో నగేష్ సేవలను గుర్తు చేస్తూ ఆయనను సత్కరించారు. అనంతరం ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి పాటుపడదామన్నారు. మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు పాగి అప్పారావు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో ఆర్.లోహిత్ జయకుమార్‌ను సర్పంచ్‌లు తదితరులు గురువారం ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులకు సహకరించాలని కోరారు. వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కిముడు రాంబాబు, పలాసి కృష్ణమూర్తి, నాయకులు గంగరాజు, మత్స్యంనాయుడు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: అన్నవరం ఎస్‌ఐ ప్రశాంత్ సేవలు అభినందనీయమని ఇన్‌చార్జ్ సీఐ అశోక్ కుమార్ అన్నారు. పార్వతీపురం జిల్లాకు బదిలీపై వెళుతున్న ప్రశాంత్‌ను గురువారం సన్మానించారు. ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. అన్నవరం ఎస్‌ఐగా సాయికుమార్ బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

వై.రామవరం: పనసలపాలెం ఎంపీపీ పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, సర్పంచ్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు త్రిమూర్తులు, నారాయణరావు, కనకరాజు, తిరుపతిరెడ్డి, బలిరెడ్డి నూకరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నేతలు

ఉపాధ్యాయుల ర్యాలీ

సాక్షి,పాడేరు/అరకులోయ రూరల్/ముంచంగిపుట్టు/గూడెం కొత్తవీధి/మారేడుమిల్లి/రాజవొమ్మంగి: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తు గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాడేరులో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

రహదారులు జలమయం

సీలేరు/వై.రామవరం: సీలేరు, వై.రామవరం ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సాగు పనులకు వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయికు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ సురేష్‌బాబు

రంపచోడవరం: ఇర్లపల్లి గ్రామంలో సీఐ జి సురేష్ బాబు ఆధ్వర్యంలో పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులు గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలన్నారు. యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎస్‌ఐ మోహన్‌కుమార్ తదితరులున్నారు.

కొయ్యూరు: బూదరాళ్లలో మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ గురువారం పర్యటించి, మహిళలతో మాట్లాడారు.మహిళలు సారాకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో సారా తయారు చేసినా, విక్రయించినా తమకు సమాచారం అందజేయాలన్నారు.

కూలిన భారీ వృక్షం

చింతపల్లి: చింతలూరు ప్రధాన రహదారిపై గురువారం భారీ వృక్షం నేలకూలింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎస్‌ఐ మహ్మద్ షరీఫ్ అలీ చొరవతో చెట్టును తొలగించారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

సాక్షి,పాడేరు : మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల్లోను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో కోరారు. సేవా కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున చేపట్టాలని, రక్తదాన శిబిరాలు కూడా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పాడేరు పాతబస్టాండులో ఉదయం 8.30 గంటలకు మహానేత వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేపట్టి పూలమాలలతో నివాళులర్పిస్తామని, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని కోరారు.

డుంబ్రిగుడ/గూడెంకొత్తవీధి : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని శుక్రవారం నిర్వహిస్తున్నామని, పార్టీ శ్రేణులు తరలిరావాలని డుంబ్రిగుడ ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, గూడెం కొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు గురువారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

ముమ్మరంగా ఈ–క్రాప్ నమోదు

గూడెంకొత్తవీధి : ఎ.దారకొండ పంచాయతీలోని గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదు చేసినట్టు సర్పంచ్ రామారావు, ఎంపీటీసీ బుజ్జిబాబు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు సాగుచేస్తున్న పంటలకు ఈ–క్రాప్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. వంచుల పంచాయతీలోని వీరవరం గ్రామంలో సర్పంచ్ కాసులమ్మ ఆధ్వర్యంలో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను చేపట్టారు. హార్టీకల్చర్ అధికారి బలరాం, వైస్ సర్పంచ్ చంటిబాబు, వీఆర్‌వో, రైతులు పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐలు మోహన్‌కుమార్, సంతోష్‌కుమార్



తహసీల్దార్ ప్రసాద్

రంపచోడవరం: ఎస్‌ఐగా ఎం.మోహన్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన టి.దుర్గాప్రసాద్ వీఆర్ పురం బదిలీపై వెళ్లారు.

రంపచోడవరం: రంపచోడవరం తహసీల్దార్‌గా పీవీఎస్ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలకు రెవెన్యూ సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వై.రామవరం: వై.రామవరం పోలీసు స్టేషన్ నూతన ఎస్‌ఐగా ఎం.సంతోష్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన గంట పృథ్వీ బదలీపై దుశ్చర్తి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు.

సీనియర్ అసిస్టెంట్‌గా నాయుడు బాధ్యతలు

కొయ్యూరు:ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

హుకుంపేట: గూడ పంచాయతీ గొచ్చరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి, స్థానిక నాయకులతో కలిసి గురువారం పర్యటించారు. నూతన పింఛన్‌దారులకు సొమ్మును ఆయన అందజేశారు.

ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరుచేస్తోందన్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. వైస్ ఎంపీపీ ప్రియాంక, నాయకులు శామ్యూల్, కోటిబాబు, జోషఫ్, మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న శెట్టి వినయ్

పెదబయలు: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 5,918 మందికి పింఛన్లు రూ.1,55,79,000 సెప్టెంబర్ నెలకు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య తెలిపారు. మొదటి రోజు 80 శాతం పింఛన్ల సొమ్ము పంపిణీ చేశామని, పూర్తి స్థాయిలో పంపిణీ జరుగుతుందన్నారు.

పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొర్రా గాసి ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. పార్టీ మరింత బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న మహానేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమానికి పార్టీ శ్రేణులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, సర్పంచ్ సుస్మిత, నాయకులు రఘునాథ్, అప్పాలు, రహ్మతుల్లా రామ్మూర్తి, సంజీవ్, రామారావు, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గాసి

పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేష్

గూడెంకొత్తవీధి: నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉమామహేష్ అన్ని శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియజేయాలన్నారు. ఏపీవో రాంప్రసాద్, ఈవోపీఆర్డీ పాపారావు, సూపరింటెండెంట్ ఇమ్మానుయేలు తదితరులున్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో మల్లేశ్వరరావు

దేవీపట్నం: పెదభీంపల్లి ఎంపీపీ పాఠశాల, ఇందుకూరుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చేపడుతున్న నాడు–నేడు పనులను ఇన్‌చార్జి ఎంఈవో వై.మల్లేశ్వరరావు గురువారం పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించాలని సూచించారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

రాజవొమ్మంగి: స్థానిక ఎస్సీ కాలనీ, అప్పలరాజుపేటలో గ్రామసమాఖ్య సభను ఏపీఎం జేమ్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సక్రమంగా సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీ సీసీ వీరనిర్మల, వీఓఏ వీణారాణి, వీఓ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

రాజవొమ్మంగి: చెరకుంపాలెంలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు గురువారం పరిష్కరించారు. గ్రామంలోని నాలుగు చేతి బోర్లకు మరమ్మతు పనులు చేయించారు.



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు